


# మరీచిక

నవులూరి వెంకటేశ్వరరావు

ఎవరో?

ఎప్పటిలా దింపి, ఆ యంత్రం తూర్పుకు తిరిగి పోతుండగా, ముందుకు చూస్తే ఒక స్త్రీ. ఎదురుగా వున్న, ఉత్తరపు కొండలకేసి నడిచి వెళుతోంది.

ఈ దిగువ నించి రమారమి ఆ కొండల దాకా నిన్నగాక మొన్న వేసిన, రోలరు బరువుకు అణిగీఅణగని రోడ్డు - ఎర్రగా, అరవై డుగుల వెడల్పున నోరు తెరిచి. ఇది నోరు ముయ్యని కొండచిలువ.

తిరిగి నీడా, తనూ తయారు. ఒకరి కొకరు తోడుగా: తోడుకొని తోడు; నిరుపయోగమైనది; వేరుచేయలేనిది. ఒక శాపంలా జీవితకాలం వదలనిది.

జీవితానికి బహుశా మరో పేరైనది. పొద్దున ఇంటినించి బయలుదేరినపుడు నీడను తను వెన్నంటుతాడు. సాయం సంధ్యలో ఇల్లు చేరేవేళ తనను అది తరుముతుంటుంది.

మరోసారి దృష్టి ముందు అరఫర్లాంగు దూరంలో నడిచి వెళుతున్న స్త్రీ మీద పడింది. ఈ రోడ్డు తన నడక గురించే వేసినట్లు, తన నడకతోనే దాని మీద రాకపోకలు ఆరంభం కాబోతున్నట్లు కదిలి వెళు తోంది. ఎవరామె? ఎవరైతేనేం? అని ఎదురు ప్రశ్న. సమాధానపరచలేని ప్రశ్న.

ఉత్సుకత ఒక సలిపే పుండు. తను వెళ్ళాల్సిన దూరంలో మూడోవంతు ఎడంగా, కవ్వింపుగా. ఈ ప్రాంతపు స్త్రీ జనాభా మొహాలన్నీ తెలిసివున్నట్లు, ఈ మొఖం ఎవరిదో తెలుసుకోవాలన్న కోర్కె. ఆమె తెలిసిన మనిషి అవనీ, కాకపోనీ, ఆ వ్యక్తిని చేరుకోవాలని దగ్గిరగా చూడాలని ఆసక్తి.

దక్షిణాన శిథిలమవుతున్న కొండ మీద లారీ రోదిస్తోంది, కొండకు గాక తనకేదో అన్యాయం జరిగిపోతున్నట్లు. దాంట్లోంచి దిగిన ''మనుషులు'' కొండను గునపాలతో తవ్వి, సుత్తులతో బాది, ముక్కలను, మట్టినీ బంగారపు గని తొలిచి పట్టుకుపోదలచినట్లు ఆ లారీలోకి నింపుతారు. కొండకు విముక్తి. మొనాటనస్‌గా, దిగులుగా, అలసటగా ఎన్నాళ్ళుని వున్నచోటే కదలక మెదలక వుండడం? హింస అనే ప్రక్రియ ద్వారా, హింస అనే సోపానం మీదుగా నిర్యాణపు అంచుకు ఆరోహణం.

ఆమె జెడ ఊగుతోంది వేలాడేసిన నల్లతాచు పిల్లలా, లయగా. ఆ నడకకు, నాట్యానికి ఏమిటి తేడా? పాతదే భావం! ఆమె నడక నాట్యానికి తల్లి అంటే కొత్తదనమా? భావంలో మార్పు చోటుచేసుకుంటుందా? ఒక విషయానికి, మార్పు వుండనిది. ఎప్పటిదే అయిన విషయానికి మసిపూసి మారేడుకాయ చేయడం అవుతుంది.

దూరపు కొండకు ఒకచోట పచ్చటి మొక్కలు, చెట్లు, పీకి, తవ్వి, నరికి, ఎండబెట్టి తగలబెడుతున్నారు. బూడిద మిగులుతుంది - తగల పెట్టలేని స్థితి, పదార్థపు ఆఖరి దశ. ఆఖరిదీ కాకపోవచ్చు - నీళ్ళలో కలిపి మాయం చేయగలిగిన మరో దశా మిగిలివుంది కాబట్టి. పరమశివుడు గుర్తుకొస్తున్నాడు


మసిచేయగలిగినవాడు, మసిని నుదుట ధరించేవాడు. మసిచెయ్యడం ఎందుకు, నుదుట పూసుకోడం ఎందుకు? బహుశ ఒకేలాగా గోచరించే పదార్థపు స్థితిని భరించలేక, కసితో, మార్పుగురించి.

దూరం క్రమేపి దగ్గిరవుతోంది. ఆమె చాలా వేగంగా నడుస్తోంది. రేగే జుత్తును చెయ్యెత్తి వెనక్కు, చెవుల మీదికి సర్దుకుంటూ. అటు నించి క్రిందికి దూసుకెళ్ళిన క్వారీ లారీ మొహం మీద దుమ్మెత్తిపోసింది. కళ్ళజోడు తుడిచి తగిలించుకోవడానికి, దుమ్మునించి ముఖాన్ని, కళ్ళను రక్షించుకోవడానికి పక్కకు మళ్ళి ఆగిన క్షణాల్లో ఆమె దూరం అయింది. ఆమె వేగానికి అడ్డంకులు, ఆటంకాలూ లేవు.

పొద్దున వేళ దిగువకు వేగంగా నడవటం జరుగుతుంది. సాయంత్రం కాళ్ళ యీడుపు నడక. ఇపుడు మాత్రం పొద్దున నడకే. ఏదో వింతను చూడబోవడానికన్నట్లు. నిజానికి ఈ ''వింత'' క్షణికమైనదే. ఆమెను చూసిన తర్వాత పరమపదించేది.

ఆ తర్వాత ఇంటికిచేరి, ఎత్తు మెట్లెక్కి, రంగువేయని తుప్పుపట్టిన గేటు కిర్రుమని తీసి, ఎవరా అని ఎప్పుడూ తొంగిచూసి లోపలికెళ్ళిపోయే భార్య వుదాసీనపు ముఖం చూసి, లోపలికి అడుగువేసి ఇంటి చేత మింగబడతాడు - తిరిగి, అది రేపు బయటికి కక్కేదాకా బందీగా గడపటానికి. వాలినపుడు సోఫా కీచుమని అరుస్తుంది - ఎప్పటిగ్గోలే. ఎదురుగా, గోడ గడియారపు మూడుముళ్ళూ యంత్రంలో భాగమని మరచి పోకుండా, యాంత్రికంగా వాటి వాటికి నిర్దేశించిన వేగాల్తో దేకుతుంటాయి, కాలంతో నెట్టివేయబడుతుంటాయి. సాలెపురుగు తిరిగి గూడు అల్లుకుం టుంటుంది - మళ్ళీ మళ్ళీ అల్లుకుంటూ కాలం గడపటానికి కాక ఈ జీవితమెందుకోయ్ బడుద్దాయ్ (?) అని దాని భాషలో, తను అడగని ప్రశ్నకు అది చెప్పని సమాధానంగా.

తను ఎందుకు ఆమె వెంటబడుతున్నట్లు? తను వెంటబడడంలేదు, ఆమె తన ముందు నడుస్తోంది. రెండిటికీ తేడా ఏమిటో! ఒక్కసారైనా వెనక్కు తిరిగి చూడకుండా, ముందుచూపుతో అతి ముఖ్యమైన పనిమీద వెళుతున్నట్లు నడక. అందంగా, హుందాగా కనిపిస్తోంది ఈ దూరానికి. దూరపు పచ్చని కొండల వైపుగా నీలపు జాకెట్టు, తెల్ల చీరలో కొండలు ఏదో అయస్కాంత శక్తితో లాగుతున్నట్లు వెళుతోంది - బాణపు వేగంతో.




ఇపుడు ఆమె ఎవరో తెలిసిపోగానే, ఇంట్లో అలసట తీరంగానే, ఎపుడూ మాట్లాడుకునే రెండు మూడు ముక్కలూ భార్య - తన మధ్య దొర్లి వూరుకున్న తర్వాత, రంగస్థలం మీద ఆ సందర్భానికి తగిన నటన పూర్తయిన పిదప, డాబా మీదకి చేరి దక్షిణం వైపుకు చూస్తాడు యథాలాపంగా. మోకరిల్లిన ''తాల్పిన్ ముక్కు'' ముందు ఉన్నతంగ కనిపిస్తూ, ఆకాశంతో విసుగూ విరామం ఎరుగని సంసారం చేస్తూ కనిపించే సముద్రం. ఊదాగా, నిర్జీవంగా గోచరిస్తుంది దూరపు ఇంద్రజాలం కారణంగా. రైట్ సోదరులమయి డాబా మీదినించి ఎవరిదీగాని క్షేత్రం లాంటి, సముద్రం - కొండలని వేరుచేసే ఇసుకమేట (శాండ్ ట్రాప్) మీదికి దూకి చూస్తే సాగరపు ప్రతాపం తెలుస్తుంది. ప్రళయం ఆసన్నమయిందంటుంది హూంకరిస్తూ.

ఎర్రమట్టి రోడ్డు మీద పెద్ద మరకలాంటి నీడ వెన్నంటి వస్తోంది - ''నీ చావు చూచేంత వరకు వదలను, నా బారినించి ఎవరూ రక్షించలేరు'' అంటూ. అది లేకుండా వుండడం సాధ్య పడుతుందా? మనిషి గాజుబొమ్మైతే నీడ వుండదు.

ఆమె అరవై అడుగుల అడ్డురోడ్డు దాటుతోంది. గాలికి నిలబడని పవిటకొంగును వెనక నించి చంకలోంచి ముందుకు లాక్కుని చేత్తో పట్టుకుని, ముందు ఇళ్ళేవో కాలిపోతున్నట్లు, తన ఇల్లే కాలిపోతున్నట్లు, వాయుసుతలా పయనిస్తోంది. నాట్యపు పరాకాష్ఠలోని వేగపు శారీరక కదలికలు. ఇద్దరి మధ్య దూరం క్రమేపీ తగ్గుతోంది.

ఇంటికి నిర్జీవంగా చేరి, నిర్వికారంగా భార్య ముఖం అరక్షణం చూసి, తప్పుచేసినట్లు చూపు మళ్ళించి, కూర్చుండిపోయి, రేపు అటునించి ఇటు వెళ్ళాల్సిన ఘడియ గురించి ఎదురుచూడటం ఆరంభించబొయ్యే ఎప్పటి అనుభవం గురించి ఆలోచిస్తూ నడవడానికి బదులు - ఆత్రుత, ఆసక్తి జోడుగుర్రాల మీద పయనం, ఇప్పటి నడక.

కసిగా ఉత్తరపు కొండను కొరికి ఉమ్మేస్తోంది ఎక్స్కవేటరు. దానికి హృదయం లేదు; ఆలోచన తొలిచే మనసూ లేదు. జీవితపు బోర్డమ్‌ను భరించాల్సిన బాధాలేదు. హింసించే రాతేగాని, హింసించబడే రాత లేదుగదా. తినే నోరు మాత్రం వుండి బలికిపోయింది.

ఆమెను పూర్తిగా చేరకుండానే నడక వేగం తగ్గిపోయింది, అనవసరం గనుక; ఆసక్తీ ఆవిరయిపోయింది.

చివరకు ఆమెను చేరి మెట్లెక్కుతూ అన్నాడు : ''చాలా వేగంగా నడవగలవే, ఎక్కడినించి వస్తున్నావ్?''

''మీరేంటి అంతలా వగరుస్తున్నారు?'' ఎదురడిగింది భార్య.

**తెల్లమచ్చలు**

అత్యంత శీఘ్రంగా, ప్రభావశీలియైన మందుతో తెల్ల మచ్చరంగు మారి, నెమ్మదిగా శరీరంలో మచ్చ లేర్పడు కారణం దూరం చేస్తూ, కల్సిపోవును. పరీక్షించుటకు 7 రోజుల మందు ఉచితంగా పంపుతాము. ఇతర వైద్యాలతో నిరాశ చెందినచో, మాకు రోగి వయస్సు మచ్చల వివరాలతో వ్రాయండి.

**జుట్టు తెల్లబడుట, రాలుట**

చిరుప్రాయంలో జుట్టు రాలుట, తెల్లబడుటను నివారించుటకు, విలువైన వన మూలికలతో చేయబడిన మందు కలదు. నల్లని ఒత్తైన జుట్టు దట్టంగా పెరిగి, జ్ఞాపకశక్తి పెరిగి మెదడును చల్లబర్చును. రోగి వయసు, వివరాలతో వ్రాయండి.

**జ్ఞాపకశక్తి**

మేము తయారు చేసి ఇచ్చు మందుల వల్ల మెదడు, తల, కళ్ళు చల్లగా యుండి, జ్ఞాపకశక్తి పెరిగి, విద్యార్థి చురుకుగా ఉండును.

వాత రోగం, మధుమేహం లావు తగ్గుట, ఇతర చర్మరోగములు, స్త్రీ పురుష అనారోగములకు సంపూర్ణ చికిత్స కొరకు వివరములుగా వ్రాయండి.

**BHUSHAN CHIKISTALAYA (8౦-2)**

**P.O. KATRI SARAI ( GAYA ) - 805 105**